నైరాశ్యంలో మేడ్చల్ బీఆర్ఎస్ కేడర్

- ద్వితీయ శ్రేణి నాయకులను నమ్మకపోవడంతో అసంతృప్తి
- ప్రచారంలో కుటుంబ పెత్తనంతో బేజారవుతున్న కార్యకర్తలు
- నేతలను అనుమానించటంతో.. దూరమవుతున్న వైనం



మేడ్చల్ బ్యూరో: మేడ్చల్ బీఆర్ఎస్‌లో నైరాశ్యం పెరిగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి చామకూర మల్లారెడ్డి ఎవరినీ నమ్మకుండా సొంత బలగంపైనే ఆధారపడి.. వారికే ఎన్నికలకు సంబంధించిన అన్నీ ప్రచార బాధ్యతలను అప్పగించటంతో బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు అసంతృప్తితో అంటీముట్టనట్లు నడుచుకుంటున్నారు. నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు అన్నీ తామై చిన్న పని నుంచి మొదలుకుని పెద్ద పని వరకు పర్యవేక్షిస్తుండటంతో.. కేడర్ నైరాశ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. పైగా పైరవీలు.. చాడీలు చెప్పే గ్రూపు లీడరల్లకే మంత్రి బలగం పెద్దపీట వేయటంతో.. అన్నింటి మౌనమే అంగీకారమన్నట్లుగా కేడర్ యాక్షన్ చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. పైగా మంత్రి ముక్కుసూటి తనం కూడా అన్ని విషయాలపై సిక్రసీ లేకుండా పోయిందనే ఆవేదన కూడా కేడర్‌ను అనునిత్యం వెంటాడుతోంది. కేడర్‌తో సహా ద్వితీయ శ్రేణి నాయకులకు ప్రత్యేక పనులేమైనా మంత్రి చేసిపెట్టినట్లయితే.. అందరి సమక్షంలో ఎక్కడపడితే.. అక్కడ అతి ఉత్సాహంతో లీకులు చేస్తుండటం కూడా వారిలో నిరుత్సాహన్ని నింపుతోంది.

ప్రచార బాధ్యతల్లో బంధు బలగమే..

అసెంబ్లీ ఎన్నికల ప్రచార రంగంలోకి మంత్రి తన బలగాన్నే రంగంలోకి దింపారు. ఎన్నికల ప్రచారంతో మొదలుకొని ఇచ్చుడు.. పుచ్చుకోవడం వంటి అన్నీ పనులను కుటుంబ సభ్యులే చక్కబెడుతున్న తీరు.. పార్టీని నమ్ముకుని కార్యక్రమాలు నిర్వహించే నేతలు.. కేడర్‌కు మింగుడుపడటం లేదని తెలుస్తోంది.

◆ మంత్రి పెద్ద కుమారుడు మహేందర్‌రెడ్డి జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు ఉమ్మడి శామీర్‌పేట్ మండలం ఎన్నికల ప్రచార ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తుండగా, మరో కుమారుడు భద్రారెడ్డి ఉమ్మడి ఘట్‌కేసర్, బోడుప్పల్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల ప్రచారాన్ని చూసుకుంటున్నారు. మంత్రి సోదరుడు గోపాల్‌రెడ్డి ఉమ్మడి మేడ్చల్ మండలం, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. మంత్రి కోడళ్లు శాలినిరెడ్డి, ప్రీతిరెడ్డి కూడా ప్రచార పర్వంలో భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నారు. మంత్రి బంధువర్గం బలగమే కాకుండా.. విద్యా సంస్థల్లో పనిచేసే అధ్యాపకులు, ఉద్యోగులు కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు.

మేకపోతు గాంభీర్యం

మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంతోమంది సీనియర్లు 30 నుంచి 40 ఏళ్లుగా రాజకీయం చేస్తున్న నాయకులు కూడా మంత్రి తీరుతో నైరాశ్యంలో పడ్డారు. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా.. లోలోపల కుమిలిపోతున్నారు. ఎన్నో ఎన్నికల్లో సమర్థవంతంగా ప్రచార బాధ్యతలు నిర్వహించిన నేతలు తమ సూచనలకు కనీసం విలువ లేకుండా పోతోందని బాధపడుతున్నారు. ఏ ఊర్లో సమస్య ఉన్నా, ఎవరికైనా ఏమైనా కావాలన్నా మంత్రిని అడిగే పరిస్థితి లేకపోవడంతో కూడా నిరాశ చెందుతున్నారు. ఎన్నికల సమయంలో తమకు స్వేచ్ఛ లేదని, పార్టీలో పదవులు, అనుభవం లేని మంత్రి కుటుంబ సభ్యులు ఏమి చెప్పినా జై కొట్టాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. మల్లారెడ్డి అన్ని విధాలుగా బలవంతుడు కావడంతోపాటు అధికారం ఉండటంతో.. కక్కలేక మింగలేక పార్టీలోనే కిమ్మనకుండా.. అసంతృప్తితో ఎన్నికల బండిని లాగుతున్నారు.

భజన పరులకే పెద్దపీట

మంత్రి మల్లారెడ్డి తన చుట్టూ తిరిగి భజన చేసే నాయకులు, కేడర్‌ను మాత్రమే పట్టించుకుంటున్నారని, కార్లు, ధన బలం ఉన్న వారినే ఆదరిస్తున్నారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు. ప్రజల్లో బలం ఉన్నా.. ధన బలం లేని నాయకులను దగ్గరకు రానివ్వడం లేదని చాలా మంది నిఖార్సయిన కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్‌లో బీఆర్ఎస్ బలంగా ఉన్నా.. మంత్రి మల్లారెడ్డి తీరుతో మోజారిటీ నాయకులు, కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారు.

అనుమానాలు.. భరించి ..

బీఆర్ఎస్.. ముఖ్యంగా కేసీఆర్‌పై అభిమానంతో.. ఉద్యమ కాలం నుంచి, బంగారు తెలంగాణ సాధన కోసం పార్టీలో చేరిన వారి సంఖ్యే అసలు కంటే ఎక్కువగా ఉంది. తెలంగాణ వచ్చాక మేడ్చల్ బీఆర్ఎస్ మొదటి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా ప్రస్తుతం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. అలాగే.. బోడుప్పల్, జవహర్ నగర్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లోని నాయకులు కూడా మంత్రి బలం, బలగం ముందు నోరు మెదపకుండా పని చేస్తున్నట్లు తెలుస్తోంది. కొంతమంది సర్పంచ్‌లు గ్రామాల్లో మంత్రి మల్లారెడ్డి తీరుపై పెదవి విరుస్తున్నారు. అర్థం లేని మాటలు, చేష్టలతో వారు ఇబ్బందులు పడుతున్నారు. తాము ఆపదల్లో ఉంటే ఏనాడూ పట్టించుకోని మంత్రికి తాము హృదయపూర్వకంగా పని చేయలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

మేడ్చల్ బీఆర్ఎస్‌లో కార్యకర్తలకు అంతే..

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, వారు లేనిదే పార్టీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పలు సమావేశాల్లో చెబుతున్నా.. మేడ్చల్‌లో మాత్రం కార్యకర్తకు విలువ లేకుండా పోయిందన్న అపవాదును మంత్రి తీరు వల్ల మూటగట్టుకోవాల్సి వస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మూడో రోజు ఏడు నామినేషన్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ శాసనసభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లకు సంబంధించి మూడో రోజైన సోమవారం మేడ్చల్ జిల్లాలో మొత్తం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మేడ్చల్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో నామినేషన్ చొప్పున రెండు, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడు, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు నామినేషన్లు సంబంధిత ఆర్వోలు స్వీకరించారని పేర్కొన్నారు.

ఎన్నికల కమిషన్ సూచనలు పాటిస్తున్నాం

ఎన్నికల కమిషన్ సూచనలు పాటిస్తున్నామని, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర విషయాలపై చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి పి.గౌతమ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఎన్నికల నోడల్ అధికారులు శ్రీనివాసమూర్తి, నర్సింహా, కృష్ణారెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వ్యయ నియంత్రణ బృందానికి నేతృత్వం వహిస్తున్న డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ఎస్‌హెచ్ అజయ్ బదూ, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌తో ఆయన మాట్లాడారు.

సవాల్ విసిరి.. స్థలం వద్దకు రాని మంత్రి మల్లారెడ్డి

గంటల తరబడి స్థలం వద్ద వేచి చూసిన బాధితులు

మేడ్చల్/మేడ్చల్ రూరల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ సమీపంలో పేదల స్థలాలు కబ్జా చేసి అక్రమంగా రికార్డులు పొందారని మీట్ ది ప్రెస్‌లో ఓ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్థలం వద్దకు రా.. పేపర్లు చూపిస్తా అంటూ సవాల్ విసిరి సోమవారం నిర్ణయించి స్థలం వద్దకు రాకుండా మంత్రి మల్లారెడ్డి ముఖం చాటేశారు. నగరంలో మంత్రి మల్లారెడ్డితో మీట్ ది ప్రెస్ కార్యక్రమం నిర్వహించగా సమావేశంలో ఓ విలేకరి మైసమ్మగూడలోని సర్వే నంబర్ 648/1,650/2,650లలో ఏర్పాటు చేసి ప్లాట్లలో మంత్రి మల్లారెడ్డి అక్రమంగా కబ్జా చేసి రికార్డులు సృష్టించి ధరణిలో చేర్చుకున్నారని, దీనిపై ప్రశ్నించగా తాను కబ్జాలు చేయలేదని, తనకు చట్టప్రకారం భూమి వచ్చిందని, కాగితాలు అన్నీ ఉన్నాయని, స్థలం వద్దకు వస్తే అన్ని చూపిస్తానని మంత్రి విలేకరికి సవాల్ విసిరారు. దీంతో కొంతమంది ప్లాట్లు ఉన్న బాధితులు, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు, విలేకరులు సోమవారం మైసమ్మగూడకు వచ్చారు. 3 గంటల పాటు అక్కడే వేచి ఉన్నా ఎవరూ రాలేదు. దీంతో బాధితులు పలుమార్లు మల్లారెడ్డికి ఫోన్ చేసినా ఆయన నుంచి సమాధానం రాలేదు. మల్లారెడ్డి, ఆయన బంధువులు తమ భూములను కబ్జాలు చేసి అక్రమంగా రికార్డులు సృష్టించి తమకు అన్యాయం బాధితులు విలేకరులతో ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

దివాలి మిలాన్ వేడుకలు



శామీర్‌పేట్: రీజనల్ ఈవెంట్ అసోసియేషన్ తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ తెలంగాణ ఇండస్ట్రీ, తెలంగాణ ఈవెంట్ ఫెసిలిటేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అలంకృత రిసార్ట్‌లో దీపావళి మిలాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు తమ కుటుంబసభ్యులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రకాల వినోద కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ సభ్యులు బలరాం, అజ్మత్ అలీ, రవి బూర, మనోజ్ ఇవాని, సందీప్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలి

- కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించండి
- మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో సంతోష్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరై పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల పాలిట బీఆర్ఎస్ ప్రభుత్వం శాపంగా మారిందన్నారు. తెలంగాణలో పదేళ్ల దోచుకున్న డబ్బుతో మళ్లీ మన ముందుకు వచ్చిన మల్లారెడ్డిని ఓటు అనే ఆయుధంతో గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన పాలనలో మేడ్చల్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. బీఆర్ఎస్ బెదిరింపులకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ ప్రజల కోసం అండగా ఉండి పనిచేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి, పేదల సంక్షేమం సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారిలో లక్ష్మణ్‌నాయక్, రఫీక్, ప్రభాకర్, రాజేశ్వర్‌రెడ్డి, రమనప్ప, సంతోష్‌తో పాటు వెయ్యి మంది ఉన్నారు. కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, అధ్యక్షులు అనంతలక్ష్మీ, నాయకులు కళ్లెపల్లి సదానంద్, కాయిత రాజుయాదవ్, కొత్తకొండ వేణు తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్ సంతోష్‌నగర్‌లో మాట్లాడుతున్న తోటకూర వజ్రేష్‌యాదవ్



కొండాపూర్‌లో కాంగ్రెస్‌లో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్

మేడ్చల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

ఘట్‌కేసర్: మేడ్చల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం, చేరికలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కండువాలు కప్పి పలువురిని కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలు యాదవ్, కౌన్సిలర్ శశికళ, జనార్దన్‌రెడ్డి, నాగరాజుముదిరాజ్, మశ్చేందర్‌రెడ్డి, అనిత, శివప్రదీప్‌రెడ్డి, సంజీవరెడ్డి, రమేశ్, రహీం, యాదగిరియాదవ్, రాంరెడ్డి, అంజిరెడ్డి, రాధాకృష్ణముదిరాజ్, దేవేందర్‌ముదిరాజ్, ఖయూమ్, సత్తిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్

మేడ్చల్‌రూరల్: ఎల్లంపేట్ గ్రామ మాజీ సర్పంచ్ తుడుం లింగం బీఆర్ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం చేసిన మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి లింగంకు పార్టీ కండువా ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షులు రమణారెడ్డి, యూత్ అధ్యక్షులు నాగరాజుగౌడ్, నాయకులు, వేణుగోపాల్‌రెడ్డి, పోచయ్య, వరదారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేద్దాం

బోడుప్పల్: కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేద్దామని బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి అన్నారు. 4వ డివిజన్ పరిధిలో నిర్వహించిన గడప గడప కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజల్లో తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్ గౌడ్, కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, మాజీ వార్డు సభ్యులు బొమ్మక్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జన సమితి మద్దతు సంతోషకరం

మల్కాజిగిరి: రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడిద్దామని మల్కాజిగిరి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు అన్నారు. తెలంగాణ జన సమితి మల్కాజిగిరి కో ఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను ఓడించడానికి కాంగ్రెస్ పార్టీ ప్రొఫెసర్ కోదండరాం మద్దతు తీసుకోవడం చాలా సంతోషకరమన్నారు. వారి సూచనలు పాటిస్తూ మల్కాజిగిరిలో ఓటర్లను అభ్యర్థిస్తామన్నారు. ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జీఎన్వీ సతీష్‌కుమార్, వెంకటేష్‌యాదవ్, పిట్టల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, శారద తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పుప్పాల వెంకటేష్ రాజీనామా

ఉప్పల్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పుప్పాల వెంకటేష్ ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. 25 సంవత్సరాలుగా క్రియాశీలక సభ్యుడిగా, ఎన్ఎస్‌యూఐ వైస్ ప్రెసిడెంట్‌గా పలు కీలక పదవులను చేపట్టారు. ప్రస్తుతం మల్కాజిగిరి టీపీసీసీ- ఓబీసీ ఉప్పల్ నియోజకవర్గ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. తన రాజీనామా పత్రాన్ని అధిష్టానానికి పంపినట్లు ఆయన ప్రకటించారు. త్వరలో తన కార్యచరణ ప్రకటిస్తానని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు(1), అతిథి అధ్యాపక పోస్టును భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ తెలిపారు. తెలుగులో పీజీలో ఎస్సీ/ఎస్టీలకు 50 శాతం మార్కులు, ఇతరులకు 55 శాతంపైగా మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అనుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు. అర్హులైన ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కళాశాలలోని కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాల అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ వీ.శ్రీనివాసులు ఫోన్: 94416 49903.

వేర్వేరు ఘటనలో గంజాయి పట్టివేత



ఉప్పల్: ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు పలుచోట్ల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ రాజీవ్ గాంధీ క్రికెట్ స్టేడియం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు గంజాయి పడేసి వెళ్లిపోయినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ఐదు కిలోల ఆరు డ్రై గంజాయి ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. మరో ఘటనలో హబ్సిగూడ ఎక్స్ రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంపై నాచారం వెళ్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద దాదాపు ఆరు కిలోల గంజాయి ప్యాకెట్లు లభించాయి. వీటితో పాటు హష్ ఆయిల్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు ఈస్ట్ గోదావరి ప్రాంతానికి చెందిన బుర్తి సురేష్(30), అదే ప్రాంతం పారుపాక ఎస్సీపేటకు చెందిన సారిక వర ప్రసాద్(33)లుగా గుర్తించారు. వీరు నర్సీపట్నం నుంచి కొనుగోలు చేసి నగరంలో అవసరమైన వారికి విక్రయిస్తుంటారు. ఆరు కిలోల గంజాయి, హష్ ఆయిల్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్నికల ప్రచారానికి దరఖాస్తు చేసుకోవాలి

ఘట్‌కేసర్: ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ర్యాలీ, ప్రచార రథాలు, బహిరంగ సభ, వాహనాల ప్రదర్శన, రోడ్ షో, మిగతా ఎన్నికల ప్రచారానికి 48 గంటల ముందు రిటర్నింగ్ అధికారికి ఆఫ్‌లైన్, సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. 48 గంటల తర్వాత దరఖాస్తు చేసుకున్న వాటిని తిరస్కరిస్తామన్నారు. అనుమతి లేకుండా ప్రచారం చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దివాలీపై అనురాగ్ విద్యార్థులకు అవగాహన

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని అనురాగ్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దివాలీ సందర్భంగా వారు తయారు చేసిన దియాలు, క్యాండిల్స్, పోస్టర్స్, పేపర్ బ్యాగ్స్ గురించి వివరించారు. అనురాగ్ స్కూల్, సుచిత్ర అకాడమీ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో అనురాగ్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ రామ్, సుచిత్ర అకాడమి స్కూల్ ప్రిన్సిపల్ దీపా కపూర్‌తో పాటు సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పోచారం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం అన్నోజిగూడలో చోటు చేసుకుంది. పోచారం పోలీస్ స్టేషన్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని డీమార్ట్ నుంచి ఘట్‌కేసర్ వైపు రాంగ్ రూట్‌లో బైకుపై వెళ్తున్న దావత్ బాను(33)ను వేగంగా వస్తున్న మహీంద్ర ఫోర్ వీలర్ ఢీ కొనడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు జోడిమెట్లలోని మేధ కంపెనీలో పని చేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

కుషాయిగూడ: ఖమ్మంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కుషాయిగూడ, చర్లపల్లికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శ్రీకాంత్‌గౌడ్, కుషాల్, సర్వేశ్వర్, సాయిప్రతీక్‌శర్మ బంగారు పథకాలు సాధించగా నిహాల్ వెండి పథకాన్ని అందుకున్నట్లు కరాటే మాస్టర్ బుడిగె రవికుమార్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రముఖ సినీ హీరో సుమన్ చేతులమీదుగా విద్యార్థులు పథకాలు అందుకున్నారు.

చందుకు గోల్డ్ మెడల్



గౌతంనగర్: మల్కాజిగిరి సర్కిల్ గౌతంనగర్‌కు చెందిన చందు ఇటీవల కర్ణాటక ధార్వాడ్ హుబ్లీలో జరిగన కర్ణాటక నేషనల్ మాస్టర్స్ గేమ్స్ 2023లో తెలంగాణ రాష్ట్రం నుంచి మల్కాజిగిరి గౌతంనగర్‌కు చెందిన చందు పాల్గొని 110 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం, 60 మీటర్ల రన్నింగ్‌లో రజతం, 400 మీటర్ల రన్నింగ్‌లో కాంస్యం సాధించాడు. ఈ సందర్భంగా చందు అభిమానులు, శ్రేయోభిలాషులు ఆయను సోమవారం సన్మానించారు.


మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



జవహర్‌నగర్: ఈనెల 11న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో సమావేశం నిర్వహించి మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గజ్జెల్లి రామచందర్, కొత్త నరేష్, కొయ్యడ వెంకటేష్, రాపాక రాంనర్సయ్య, బందారపు భాస్కర్, భాగ్యలక్ష్మి, నర్మద, రజియాబేగం, ఎండీ గౌసియా, శ్వేత, యాదమ్మ, రాజేశ్వరి, ప్రమీల, పాల్, ఆగయ్య, సంపత్, ఉప్పలయ్య, యాదగిరి, రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

‘పది’కి.. ప్రత్యేక తరగతులు

- వందశాతం ఉత్తీర్ణతపై జిల్లా విద్యాశాఖ కసరత్తు
- 'లక్ష్యం' పేరుతో ప్రత్యేక కార్యాచరణతో ముందుకు..



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంచి, వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేసేందుకు ‘లక్ష్య’ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేశారు. ఇందులో భాగంగానే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వస్తున్నారు. ఈ మేరకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కూడా జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా పదిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించడంతో పాటు పాఠశాలల వారిగా తల్లిదండ్రులతో కార్యాచరణ కార్యక్రమాన్ని రూపొందించి ముందుకెళ్తోంది. ఇప్పటికే మండల, పాఠశాల స్థాయిలో విద్యాధికారులు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించిన జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి డిసెంబర్ వరకు సిలబస్ పూర్తి చేసి, జనవరి నుంచి రివిజన్ చేసే ప్రక్రియను కొనసాగించేలా కసరత్తు చేస్తున్నారు.

పదిలో ఏడు వేల మంది విద్యార్థులు

మేడ్చల్ జిల్లాలోని 108 ఉన్నత పాఠశాలలలో ఏడు వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మూడు జిల్లాల్లోని పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే.. కొత్తగా ఏర్పడిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2016-17 సంవత్సరంలో 85.22 శాతం, 2017-18లో 87.90 శాతం, 2018-19లో 92.98 శాతం, 2020-21లో 92 శాతం, 2022-23 విద్యా సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించింది.

ప్రత్యేక తరగతులు ఇలా..

జిల్లాలోని 108 ప్రభుత్వ హైస్కూళ్లలో కూడా డిజిటల్ విద్యను అమలు చేస్తున్నారు. గత ఏడాది విద్యార్థులు ఎక్కువగా ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోంది. పాఠశాల పని దినాల్లో ఉదయం బాలికలకు, సాయంత్రం బాలురకు ఒక గంట అదనంగా ప్రత్యేక తరగతులను నిర్వహించేలా విద్యాశాఖ కార్యాచరణతో ముందుకెళ్తోంది. వారానికి దాదాపు 12 క్లాసులు భోదిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో నాలుగు క్లాసులు గణితం, ఐదు క్లాసులు సామాన్య శాస్త్రం, మూడు క్లాసులు సాంఘిక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు భోదించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పదో తరగతి విద్యార్థులను ఫిబ్రవరి నుంచి ప్రతిరోజూ ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్రలేపేందుకు కూడా ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పనితీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో కసరత్తు చేస్తోంది.

‘పది’లో మెరుగైన ఫలితాలు లక్ష్యం

మెరుగైన ఫలితాలు లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు 'లక్ష్యం'లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఎన్నికల ప్రభావం పడకుండా ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం సిలబస్ పూర్తి చేయాలి. ఈసారి జిల్లా నుంచి పదో తరగతిలో అత్యధిక మార్కులు విద్యార్థులు సాధించేలా కృషి చేయాలి.

- విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి

గంగపుత్ర సంఘం నూతన కమిటీ ఎన్నిక

బోడుప్పల్: బోడుప్పల్ గంగపుత్ర సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కూర బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా బంగారి కుమార స్వామి, కోశాధికారిగా నాగుల లింగమూర్తి, ఉపాధ్యక్షులుగా కుదిరిపాక జగన్నాథం, నర్ర ప్రభాకర్, పూస అశోక్, గోకుల సత్యనారాయణ, ఉప కోశాధికారిగా మంగిడిపల్లి అశోక్, పబ్లిసిటీ కార్యదర్శిగా నన్నుట రాజేశ్వర్, సంయుక్త కార్యదర్శులుగా రాచమల్ల నాగరాజు, తుంగ తుర్తి సూరయ్య, పంబరీ భిక్షపతి, గడప సత్యనారాయణ, పూస యాదగిరి, కార్యనిర్వాహణ కార్యదర్శులుగా నర్మల మనోహర్, దిటి అనిల్, రాసకట్ల రాజేందర్, నీలి దేవరాజ్, పూస బాలకిషన్, సలహాదారులుగా పాక మధుసూదన్, పాక మల్లేశ్వర్‌రావు, పాక శ్రీనివాస్, పూస యాదగిరి, దీటి రాజారాం, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పూస భీంరాజ్, గడప నర్సింగ్‌రావు, కాముని శివకుమార్, పెంపటి నాగరాజు ఎన్నికయ్యారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు

బోడుప్పల్: మెదక్ జిల్లా బహుదూర్‌పల్లిలో జరిగిన ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో సన్ ఫైటర్స్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ విద్యార్థులు సత్తా చాటారు. బోడుప్పల్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సన్ ఫైటర్స్ కుంగ్‌ఫూ వ్యవస్థాపకులు, మాస్టర్ నంద ప్రసాద్ మాట్లాడుతూ చాంద్‌బాషా, సాత్విక్ గోల్డ్ మెడల్స్, నవనీత్, నవీన్, కీర్తన్ సిల్వర్ మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు. రిత్విక్ సాయి, సందీప్ బ్రాడ్ మెడల్స్‌తోపాటు ఓవరల్ చాంపియన్‌షిప్‌ను సాధించినట్లు వెల్లడించారు. రానున్న పోటీల్లో మరిన్ని మెడల్స్ సాధించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.